క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మోపాల్: గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై దయాళ్‌సింగ్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ తండాలో శనివారం సైబర్ నేరాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు, మెసేజ్‌లు వస్తే స్పందించవద్దన్నారు. అనవసర లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దన్నారు. అలాగే వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లవెల్లిలో వైద్యశిబిరం



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎస్ఎస్ఆర్ పాలీ క్లీనిక్ ఇందల్వాయి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యుడు అనుదీప్, సిబ్బంది కలిసి సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సర్పంచ్ విజయ లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ బాబుశరత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన రొద్ద గంగారాం కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వారి కుటుంబ సభ్యులకు శనివారం స్థానిక నాయకుడు అల్లూరి లింబారెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ నాయకులు కుంట మల్లేష్, బాలయ్య, కుదాల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిని ఎంపిక చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ తెలిపారు. బాల్కొండ ప్రభుత్వజూనియర్ కాలేజీలో శనివారం అధ్యాపకుడు రాజేష్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని తెలిపారు.

ప్రగతిభవన్ పేరు మార్పు హర్షణీయం

సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ పేరును సామాజిక సంఘ సంస్కర్త, బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాయవార్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరించడం శుభపరిణామమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, ఆయనకు సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

క్షత్రియలో 'మన పండుగలు'



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రీయ పాఠశాలలో శనివారం 'మన రాష్ట్రాలు – మన పండుగలు' అనే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారతదేశం భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైనదన్నారు. మన దేశంలో 29 రాష్ట్రాలు, 8 కేంద్రం పాలిత ప్రాంతాలు ఉన్నాయని, వారి ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు, సాంప్రదాయాలు భాషలు గొప్పవని అన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ రాష్ట్రాల వేషధారణ, వారి వంటకాలను ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సిబ్బంది గంగాధర్, పరిక్షిత్, అక్షయ్, ప్రిన్సిపల్ అనిల్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి స్కీంను సద్వినియోగం చేసుకోండి





సిరికొండలో ఆర్టీసీ బస్సు వద్ద సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. ఇందల్వాయి బస్టాండ్‌లో..

సిరికొండ/ఇందల్వాయి: ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణం పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రభుత్వం శనివారం ఈ పథకాన్ని ప్రారంభించడంతో సిరికొండ మండల కేంద్రంతో పాటు రావుట్ల తదితర గ్రామాల్లో ఆర్టీసీ బస్సుల వద్ద కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. బస్సులకు కొబ్బరి ఆకులు, పూలదండలు కట్టి అలంకరించారు. ఎన్నికల హామీలో భాగంగా రెండు హామీలను అమలు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, దేగాం సాయన్న, గంగారెడ్డి, లింబాద్రి, సంతోష్, నర్సారెడ్డి, మల్లేష్, జాఫర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయిలో కాంగ్రెస్ సోనియా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఉచిత ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని బస్టాండ్‌లోని మహిళలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి టోల్‌ప్లాజా వద్ద నేడు ఘన స్వాగతం పలకడానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, కర్సం మోహన్, ఎల్ఐసీ గంగాధర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.





కమ్మేసిన పొగమంచు

సిరికొండ మండలంలో శనివారం ఉదయం పొగమంచు కమ్ముకుంది. పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో ఏమి కనబడని పరిస్థితి నెలకొంది. రోడ్డు మార్గం కూడా కనిపించకుండా ఉండటంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించారు.

– సిరికొండ

వైభవంగా ఆరట్టు ఉత్సవం





పడకల్‌లో ఆరట్టు ఉత్సవం నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు.. అయ్యప్ప స్వామి శోభాయాత్ర

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో శనివారం అయ్యప్ప స్వామి ఆరట్టు మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయ్యప్ప స్వామి మాలధారులు అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి, ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు ఆరట్టు ఉత్సవంలో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో గురు స్వాములు నర్సారెడ్డి, తిరుపతి, నితిన్‌రెడ్డి, పుప్పాల శ్రీనివాస్, లింగం, శ్రీధర్, ప్రదీప్‌గౌడ్, దత్తాద్రిగౌడ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా పడిపూజ..

జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్‌లో ఆదివారం అయ్యప్ప స్వామి సామూహిక మహాపడి పూజ నిర్వహించనున్నట్లు గురుస్వాములు నర్సారెడ్డి, తిరుపతి, లింగం, శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప సేవా సమితి, గ్రామాభివృద్ధి కమిటీ, రమణ గురుస్వామి ఆధ్వర్యంలో పడి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాదం(బిక్ష) ఉంటుందన్నారు. కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు.

నగరంలో అయ్యప్ప మహా పడిపూజ

నిజామాబాద్ సిటీ: నగరంలోని వినాయకనగర్‌లో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజ, ఋషితుల్య పూజ ఘనంగా నిర్వహించారు. వినాయక్‌నగర్‌కు చెందిన చందూర్ రాజేందర్ స్వామి, అరుణ్ శర్మ సమక్షంలో పడిపూజ కొనసాగింది. ఈసందర్భంగా అయ్యప్ప భక్తులు అయ్యప్ప స్వామి పాటలపై నృత్యాలు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



నగరంలో అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

రెవెన్యూశాఖ మంత్రికి సన్మానం





సుభాష్‌నగర్: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శనివారం రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నూతన శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌ను రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూశాఖ ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కమ్మ సంఘం రజతోత్సవాలు



బోధన్: పట్టణ కమ్మ సంఘం భవనంలో శనివారం సంఘం రజతోత్సవాలు, కార్తీక మాస వన భోజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు, విద్యార్థులు, పురుషులకు ఖోఖో, క్రికెట్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆదివారం వేడుకలకు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, ఐఏఎస్ కోచింగ్ అకాడమీ అధినేత మల్లవరపు బాలలత పాల్గొననున్నట్లు తెలిపారు. కమ్మ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పల్లెంపాటి శివన్నారాయణ, దావులూరి హరినాథ్‌బాబు, కోశాధికారి పల్లెంపాటి శ్రీధర్, న్యాయవాది హనుమంత్‌రావు, ప్రతినిధులు అప్పారావు, ఆదినారాయణ, అంతయ్య, గాంధీ, రంగారావు, సూర్యనారాయణ, భార్గవ్ పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డిని కలిసిన నాయకులు



ఎడపల్లి(బోధన్): బోధన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సుదర్శన్‌రెడ్డిని శనివారం ఎడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వారు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జైతపూర్ సర్పంచ్ శ్రీలక్ష్మీ రాంగోపాల్, నాయకులు ఆకుల మనోజ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మంచిప్ప ముంపు నిర్వాసితులు





ఎమ్మెల్యే భూపతిరెడ్డితో సిరికొండ నాయకులు.. పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముంపు నిర్వాసితులు

మోపాల్/సిరికొండ: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని శనివారం హైదరాబాద్‌లో మోపాల్ మండలంలోని మంచిప్ప ముంపు నిర్వాసితుల కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి, ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్ పాత డిజైన్ ప్రకారం పనులు చేపట్టి, ముంపు లేకుండా చూడాలని ఎమ్మెల్యేను నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. అలాగే సిరికొండ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు తూర్పు రాజేష్, మోహన్‌రెడ్డి, శంకర్ నాయక్, ముత్యంరెడ్డి, భాస్కర్, భూపతినాయక్, సంతోష్‌నాయక్, ఆసిఫ్, మోహన్, జీవన్‌నాయక్, నౌసీ ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఆదివారం మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేస్తుండటంతో ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద ఘన స్వాగతం పలికి, విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ర్యాలీ ప్రారంభమౌతుందని, నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు





సిరికొండలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. ధర్పల్లిలో..



నగరంలో..

సిరికొండ/ధర్పల్లి/జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి/మోపాల్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని మండలాలు, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్‌లు కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు నాయకులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



జక్రాన్‌పల్లిలో..



మల్లారం గ్రామంలో..

రేపు శివపార్వతుల కల్యాణం

నిజామాబాద్ సిటీ: నగరంలోని శంభునిగుడిలో రేపు(సోమవారం) సాయంత్రం మాస శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాండ్ల లింగం, ఈవో రవీందర్‌గుప్తాలు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,600	వెండి (కిలో)	76,000
22 క్యారెట్స్	57,720	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	75	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	75	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	70	100	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-2 ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-10.00, 4.45, 7.35, 10.35; యానిమల్(తెలుగు)-1.00
- స్క్రీన్-3 హాయ్ నాన్న -10.10, 1.05, 7.45, యానిమల్(హిందీ)- 4.00, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 ఎక్స్ట్రాఆర్డినరీమెన్(తెలుగు)-12.00, 3.20, 6.40, 10.00
- స్క్రీన్-2 యానిమల్(హిందీ)-10.00, 6.00 10.00; యానిమల్(తెలుగు)-2.00
- స్క్రీన్-3 ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్-(తెలుగు)-10.10; వంకా(ఇంగ్లీష్)-1.30,7.25,10.10; సామ్ బహదూర్(హిందీ)-4.15
- స్క్రీన్-4 యానిమల్(తెలుగు)-11.15,6.30; హాయ్‌నాన్న(తెలుగు)-3.15, 10.30

- దేవి హాయ్ నాన్న(తెలుగు)
- నటరాజ్ యానిమల్(హిందీ)
- లలితామహల్ యానిమల్(తెలుగు)
- విజయ్ ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)

తుపాన్ బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

ఆర్మూర్: రాష్ట్రంలో మిగ్‌జాం తుపాన్‌తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన అన్ని పంటలకు ఎకరానికి రూ. 50 వేలు, ప్రాణ నష్టం జరిగిన కుటుంబాలకు రూ. పదిలక్షలు, మూగ జీవాల నష్టానికి పరిహారం చెల్లించాలన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని చెల్లించాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కెచ్చెల రంగయ్య, దేవరాం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: పట్టణంలోని ఎన్డీఎస్ఎల్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 127వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఎన్డీఎస్ఎల్ మూసివేత నాటి నుంచి తమకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులు బషీరుద్దీన్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంతవైద్య శిబిరం

నందిపేట్ : మండలంలోని వెల్మల్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులకు శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 200మంది విద్యార్థులకు దంతవైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం దంతాల సంరక్షణపై సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.